

# సమీర

ఏకాంకిక

శ్రీమతి కె. రామలక్ష్మిగారు

## * మొదటి దృశ్యం *

దేవాలయ ప్రాంగణం. స్వామి ఉత్సవాలు జరుగుతూ ఉంటవి. దేవాలయానికి ప్రక్కగా సరుగుడు తోపు. నరేంద్రుడు 25 సంవత్సరాలయువకుడు నేలమీద పిచ్చిగా వ్రాసి చెరిపేస్తూవుంటాడు. అ భ యు డు నరేంద్రుని మిత్రుడు అతనికన్న కొంచెం చిన్న. దుడుకుస్వభావం.

అభయుడు : చూడవోయ్, నరేంద్రా! ఎవరేనా వింటే నవ్వుతారు. ఉత్తమ క్షత్రియకులంలో పుట్టి ప్రాణాన్ని గడ్డి పోచగా యెంచే నీవు—

నరేంద్రుడు : నా సమీరను రక్షించుకోలేని చేతకాని వాడి నయాను.

అభ : అది కాదు నే నన్నది. బలవత్తరమైన సంఘట్టనలు మనం ఎదుర్కోలేనప్పుడు—

నరే : ప్రాణత్యాగం చెయ్యవలసిందే.

అభ : పిచ్చివాడా! నీ చావు యెవరి కఠిన మనస్సును కరిగిస్తుంది. గర్వాంధకారంలో కన్నూ మిన్నూ కానని కామలోలుడైన చక్రవర్తినా? మనసారా వలచిన ప్రియుణ్ణి వదలి వైభవం కోసం చక్రవర్తిని వివాహమాడ సిద్ధపడిన సమీరనా?

నరే : నువ్వు పొరబడుతున్నావు, అభయా! నా చావు నాకే ఆనందాన్ని చేకూరుస్తుంది.

అభ : వట్టి వెర్రి. నా ప్రియుడు నా కోసం మరణించేడని సంతసించే నిర్భాగ్యురాలెవరోయ్? నీ ప్రేమ చాటడానికేమైనా చెయ్యి. ప్రాణ త్యాగం చెయ్యడం మన పని కాదు.

నరే : నా బాధ నీ కర్థం కాదు, అభయా! చిరునవ్వుతో నా కౌగిలిలోకి వచ్చి కరిగిపోయ్యే నా సమీర ఒక కామలోలుడైన చక్రవర్తికి బానిసగా యేర్పడుతుంటే చూసి వూరుకోడం...

అభ : చక్రవర్తి నిరంకుశుడు. తాను వలచిన కాంతను తన దిగా చేసుకోగల సమర్థుడు.

నరే : అది కాదు, అభయా! నేను రాజ ప్రాసాదంలోకి ఈ రాత్రే వెళ్లి నా సమీరను నా దగ్గరనుండి వేరుచేసే ఆ చక్రవర్తిని ఒక్కపోటులో—

అభ : అంతకంతకు పిచ్చివాడి వవుతున్నావు, నరేంద్రా! సకల హిందూసామ్రాజ్యచక్రవర్తి—ఒక సర్దారు కన్యను కామించడం యేమిటి?—అంతకన్న ఒకచిన్న యోధుడు, చక్రవర్తి అగ్రహానుగ్రహాలలో నిమిత్త మాత్రుడు—రాత్రివేళ—చీమదూరని అంతఃపురంలో నివసించే చక్రవర్తిని చంపడం...

నరే : నేనేం చేయను? అంతకంతకు నా సమీర దూరమవుతోంది.



VETAPALEM

అభ : నీ జీవితంలో సమీర తోటి అధ్యాయం ముగిసింది. సమీర రేపు చక్కగా అలంకరించుకొని రాజలీవితో అంతఃపురాన్ని అలంకరిస్తుంది. నీవు వున్మత్తుడవై నీటిలో ఆ స్వప్నసుందరిని చిత్రించి నిద్రలో ప్రేమగీతాలు పాడుకోవాలి.

నరే : నాకు తెలియదు, అభయా! ఆ నాటి రాత్రి నా గుండెల మీద తలపెట్టి నా స్పర్శతోటి కన్నులు మూసుకొంది. ఆ కళ్లు మోసం చేయలేవని తెలుసు. ఎగిరే పక్షికోసం నిర్లక్ష్యంగా చెయ్యి జాపితే ఆమె వ్యర్థ ప్రయత్నానికి చేతిగాజులు ఘల్లున నవ్వి అపహాస్యం చేశాయి. నల్లటి చీరలో దేహాన్ని దాచినా, పచ్చటి కాంతులు ప్రజ్వలించేటప్పుడు నా కన్నులకు మైకం కల్గేది.

అభ : ఎవరు, ఆ వెడుతూన్నది సమీరేనా ?—

నరే : అవును. వెనకనుంచికూడా ఆమెని వెయ్యిమందిలోనైనా గుర్తించకలను. ఇట్లా నేను కుమిలి యేడుస్తున్నట్టుగానే ఆమెకూడా దుఃఖపడుంతోదంటావూ ?

అభ : లేదు. అదుగో ఎందుకో నవ్వుతోంది. ఆమె ముఖాన విచార చిహ్నాలు కొంచం అయినా లేవు.

నరే : విచారాన్ని ఆమె దిగమ్రింగి అబద్ధపు నవ్వును, లేని సంతోషాన్ని కనపరుస్తోంది. లేని విషయాలను ఆమె ఎంత చక్కగా ప్రదర్శిస్తుందనుకున్నావు. ఆ వేళ రాత్రి 'పాము' అని నన్ను భయపెట్టింది. నిజంగా యేమీలేదు. 'పట్టిది, నరేంద్రా' అని నన్ను కౌగిలించుకొంది.

అభ : అటువంటిదే మీ ప్రేమకూడా కాబోలు.

నరే : నీకు సమీర అంటే అపరిమితమైన కోపం. అందుచేత అలా అంటావు. ఓసారి నేను రాలేదని కృత్రిమకోపాన్ని నటించింది. నేను హడిలిపోయా.

అభ : ఇక్కడ వుండు, నరేంద్రా! యిప్పుడే వస్తా.

## * రెండవ దృశ్యం *

కొంతమంది స్త్రీలు దేవాలయంలోంచి తిరిగి వస్తూవుంటారు. ఓ సన్నని గాలికెరటంలా నవ్వుతున్న సమీర ముందు వస్తూవుంటుంది. అభయుడు వెనుకనుండి కేక వేస్తాడు.

సమీర : ఎవరది? అభయసింహుడా!

అభ : అవును నేనే. కాకపోతే చక్రవర్తి పట్టమహిషిని పలుకరించే ధైర్యం ఎవరికుంటుంది?

సమీ : నువ్వేదో కోపంలో వున్నావు, అభయా! ఇప్పుడు కాదు నీతో మాట్లాడ్డం. తరవాత—

అభ : అధికారం రాకుండానే నీ కంటికి నేను తేలిక య్యాను. నరేంద్రుని గురించి కాకపోతే నీ ముఖం కూడా చూడ్డానికి సిగ్గుపడతాను.

సమీ : నువ్వు నరేంద్రుని ప్రాణమిత్రుడవు కావడంచేత నాకు సన్నిహితుడవు. లేకపోతే, ఒక రసపుత్ర కన్యను పలకరించే ధైర్యం నీకుంటుందీ ?

అభ : అభయుని సంగతి నీ కిదివరకే తెలుసు ననుకున్నా సమీరా! ప్రపంచంలో స్నేహానికి తప్ప మరే దానికి భయపడడు.

సమీ : వయస్సున నాకన్న చిన్నవాడివి. నీకు కోపం వచ్చిన కొలదీ, నీ చిన్న కళ్లు యెఱ్ఱపడుతూన్న కొలదీ—నీ పెదిమలు కంపిస్తుంటే నాకు నవ్వు పుడుతోంది.

అభ : నీకు నవ్వు కదూ! సమీరా, ఓ వ్యక్తి నీకోసం తపించి ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడుతూవుంటే పెళ్లికూతురులా ముస్తాబై చక్రవర్తి వుంపుడుకత్తె క్రింద...

సమీ : నీకుకోపం అంతకంతకు మితిమీరుతోంది, అభయా! తక్కిన ప్రేమికులవలె జుట్టు విరియపోసుకొని ప్రాణత్యాగం చెయ్యలేదని నీ కోపం...

అభ : అయితే నరేంద్రుని మీది నీ ప్రేమంతా పట్టి బూటకమన్న మాట.

సమీ : నువ్వు నన్ను అర్థంచేసుకోడం లేదు. నరేంద్రుడు నా ప్రేమ మూర్తి. ప్రతి అణువులోనూ నరేంద్రుడు మూర్తీభవించిపోయాడు. నేను చక్రవర్తిని నిరాకరిస్తే నరేంద్రుని గతి యేమవుతుందో నీకు తెలుసూ—తక్షణం నరేంద్రుని శిరస్సు నా వడిలో వాలుతుంది. నన్ను బలవంతంగా చక్రవర్తి రాజధానికి తీసుకొనిపోయి భార్యగా స్వీకరిస్తాడు.

అభ : నీ ప్రేమంతా యేమయిపోయింది, సమీరా! నీ స్వభావం కుటిలం. నీ జాతి భావాలు నీ లోనే మూర్తీభవించి పోయాయి.

సమీ : ప్రేమ ప్రవాహానికి చెలియలికట్ట వైవాహికమూ, అభయా! బలవత్తరమైన సంఘట్టనల నెదుర్కో-లేనప్పుడు నరేంద్రుడు పిచ్చివాడయాడు. ఇంకా సమీర బ్రతికి వుందని నీ కోపం. "చక్రవర్తిని యెదిరించి పోరాడుతాడు నరేంద్రుడు" అని చెప్పవేం నువ్వు? సిగ్గులేక నరేంద్రుడు పిచ్చి వాడయాడంటావూ? వట్టి చేతకాని వాడని గుర్తించటం లేదూ!

అభ : చక్రవర్తిని యెదిరించడం నరేంద్రునికి సాధ్యమా?

సమీ : బ్రతికి వున్న సమీరను చంపడం నీకు సాధ్యం కాబోలు?

అభ : నిన్ను నేను అర్థం చేసుకోలేక పోతున్నాను.

సమీ : చక్రవర్తిని నువ్వు కాని, నరేంద్రుడు కాని యెదిరించ లేరని తెలుసు. అతన్ని బ్రతి మాలడం భంగపాటుకే.

అభ : నరేంద్రుని గతి యేమిటి?

సమ : నా గతి యేమిటో నాకు తెలుస్తే కదూ, అభయా! ఇది మొండి సమాధానం అంటావు. రేపటినుంచి ముక్కు-మొగం యెరగని చక్రవర్తికి భార్యగా నటించాలి. అతడు నా మీద చూపే ప్రేమనూ, ప్రీతినీ భరించాలి. ఇదంతా నరేంద్రునికి లేదు.

అభ : నరేంద్రునితో యిదంతా ఓ సారిచెప్పు. నీవు ఉద్యాన వనంలోకి రా.

సమీ : నేనూ అదే అను కొంటున్నాను...నరేంద్రుడు జాలి గుండె కలవాడు. అతన్ని జాగ్రత్తగా చూసే భారం అంతా నీది అభయా. నీవు నీ అక్కను సరిగ్గా అర్థం చేసుకున్నావనుకుంటూ.

అభ : కంటతడా సమీరా!

సమీ : లే-దు, అభయా! నా సంగతి నీకు పూర్తిగా తెలుసు. వట్టిచేతకాని దాన్ని. మొండిదాన్నేమో కూడా! ఏమిటీ నావైపుచూడు.

అభ : నమస్కారం...

సమ : ఏమిటిది, అభయా! నరేంద్రునితో చెప్పు. మా ప్రణయ సంఘట్టనలన్నిటికీ నీవే కారకుడవనుకుంటూ మొదటినుంచీ తుది వరకు. కడసారిగా కూడా నీవే! వెడతా—

అభ : స-మీ-రా...

## * మూడవ దృశ్యం *

అభయుని ఉద్యానవనంలో పెద్దనాగమల్లి చెట్లమధ్య-పున్నాగపూల సన్నని పరిమళం—పండు వెన్నెల. సమీర పడుకొని, నరేంద్రుడామె ప్రక్కగా.

సమీ : అందరూ అంటూవుంటారు. జీవితంలో ప్రయాణం చేస్తూ—ఓ ఊళ్లో ఒకరు మన్ని కలుస్తారు. కొంత దూరంవరకు మనకు సన్నిహితులవుతారు. వారు లేని జీవితం వ్యర్థం అనిపిస్తుంది. వారు లేందే బ్రతకలేమనుకుంటాము. రెండో వూళ్లో ఆ ఒకరు దిగిపోతే ఎట్లా ప్రయాణం చేస్తాం? అని హడలిపోతాం...

నరే : నిన్ను నా జీవితంలో యెట్లా మరిచిపోయేది! రేపు నువ్వు వెళ్ళగానే నా గతేమవుతుంది?

సమీ : ఒక చక్కటి పిల్లను తెచ్చి పెళ్లాడు. లేకపోతే నేనే చేస్తాను పెళ్లి. అవును, నరేంద్రా! నా చేతుల తోనే...

నరే : నీ చేతులతోనే నాపీకకు, ఆ నిర్భాగ్యురాలికి వురి తాడు తగిలిస్తావు—అప్పుడప్పుడు, మాట్లాడేది సమీరేనా అనుకొంటూ.

సమీ : అవును, నరేంద్రా! నా చేతులకు నువ్వు క్రొత్త కాదు. సిగ్గులేకుండా సహజంగా వచ్చేస్తాయి. ఇదివరకు సిగ్గులో మైకం కప్పే కళ్లకు యెంత మందిలోనైనా నిన్ను పట్టి తెచ్చే పరిచయంచేసావు. నిన్ను చూడగానే యెందుకో......... దగ్గరగా తీసుకోవాలనిపిస్తుంది. అలా చూస్తావేం నరేంద్రా?

రేపటినుంచి యీ సిగ్గు లేనిది, మళ్లీ సిగ్గు నటించాలి. ప్రపంచ సుఖాన్ని చూసిన నా కళ్లు యేమీ తెలియనట్లుగా మళ్లీ మూతలుపడాలి. మైకం వదలిన యీ దేహానికి బలవంతంగా మళ్లీ చలనం లేకుండా చెయ్యాలి—ఇదంతా నటన.

నరే : ఎక్కడికైనా పారిపోదాం—సమీరా...

సమీ : ఎలాగ? ముందు తండ్రిగారి జాగీరు పోతుంది. తరువాత నా నరేంద్రుని శిరసు నా చేతులలో పెడతాడు—లేకపోతే నీ సమీర శిరస్సు నీ చేతులలో పెడతాడు చక్రవర్తి. అప్పుడు యేం జాగ్రత్త తీసుకుంటావో...

నరే : నువ్వు సమయం లేకుండా వేళాకోళం ఆడతావు.

సమీ : మనకు మిగిలింది యీ ఒక రాత్రే, నరేంద్రా! నా మనస్సునీ, శరీరాన్ని పూర్తిగా ఎరిగి వున్న నీ దగ్గరే వాటి భావాలకీ చేష్టలకీ స్వేచ్ఛ—నీ కిష్టంలేనప్పుడు రేపటినుంచి నా బ్రతుకు ఓ పెద్ద నటనగా మారిపోతుంది. ఆ నిరంకుశుడు లక్ష్యపెడతాడా—ఇష్టపడతాడా—

నరే : రేపటినుంచి నా బ్రతుకూ అంతేగా...

సమీ : ఓ నిరంకుశరాణి నీమీద వలపుచే నిన్ను బలవంతంగా తీసుకు రమ్మని ఆజ్ఞాపిస్తే—

నరే : నేను లోబడను—ఆమె కోర్కెను నిరాకరిస్తాను.

సమీ : నీ యెదురుగుండా సమీరను తెచ్చి చంపుతానంటే.

నరే : ............

సమీ : పిచ్చి నరేంద్రా! అంతే. నిర్మలప్రేమప్రవాహం కలుషితమయితే ప్రేమికుల పొరబాటది—అవునా—రేపటినుంచి అభయుడూ, నువ్వూ—నవ్వుకుంటూ వెడుతోందనుకొన్న సమీర హృదయంలో దుఃఖం అసహ్యం మిళిత మయిపోయాయి!

నరే : పోనీ, ఆత్మ హత్య చేసుకొంటే...

సమీ : బ్రతికివుండగా విపరీత సంఘటనలకు అనుగుణంగా వర్తించి ఆనందాన్ని పొందలేనప్పుడు, చచ్చి సాధిస్తామంటే నాకు నమ్మకం లేదు నరేంద్రా... నేను వెడుతున్నా. నీకు అభయుడున్నాడు...


## మూడు విషయాలు

మీరు గుర్తించవలసినవి

ఎరిగిన అట్టపెట్టె

తెలిసిఉన్న పేరు

నమ్మకమైన ఉత్పత్తిదారులు



## జాబ్‌కో

## ఫౌంట్ ఇంక్

ఐదు రంగులలో అందివ్వగలము

బ్లూ బ్లాక్ — బ్లూ

రెడ్ — వైలెట్ — గ్రీన్

★

జయ భారతం కంపెని

మదరాసు :: బెంగుళూరు :: ఎర్నాకులము